యూనిట్
I

# 2. స్వభాష

- పానుగంటి లక్ష్మీనరసింహారావు

## ఆలోచించండి - చెప్పండి




### ప్రశ్నలు

1. జంఘాలశాస్త్రి దేని గురించి ఉపన్యసించి ఉంటాడని మీరనుకుంటున్నారు?
2. ఎదుటి వ్యక్తి ప్రశంసిస్తున్నా, జంఘాలశాస్త్రి నిర్ఘాంతపోవడానికి కారణమేమైవుంటుంది?
3. జంఘాలశాస్త్రి అంటే ఎవరో మీకు తెలుసా?

### ఉద్దేశం

పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారు సంఘ సంస్కరణాభిలాషతో 'సాక్షి' పేరుతో అనేక వ్యాసాలను రాశారు. అందులో భాగంగా మన భాష గొప్పతనాన్ని గూర్చి 'జంఘాలశాస్త్రి' అనే పాత్ర ఉపన్యాసం ద్వారా తెలియజేశారు. ఈ విధమైన ఉపన్యాసాల ద్వారా పానుగంటివారు మనలోని ఆధునిక విపరీతపు పోకడలను వ్యంగ్యంగా చిత్రించి ఎత్తి చూపారు. భాషాభిమానం పెంచడం పాఠం ప్రధాన ఉద్దేశం.

ఈ పాఠ్యభాగం **పానుగంటి లక్ష్మీ నరసింహారావు** గారు రచించిన సాక్షి వ్యాసాలలోని మూడవ సంపుటి లోనిది.

not to be republished © SCERT

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

"మీకసత్యముగా దోపవచ్చును - నాయనలారా! అసత్యము కాదు. ఆయన యాంధ్రుడు - కృష్ణాతీరమున బుట్టినవాడు. శుద్ధ శ్రోత్రియ కుటుంబములోనివాడు. ఎం.ఏ., బి.ఎల్., పరీక్షలలో నుత్తీర్ణుడైనవాడు. న్యాయవాది వృత్తిని నిరాఘాటముగా నిరంకుశముగా నిర్వర్తించుచున్నవాడు. అట్టివాని నాహ్వానించి యాదరించి యాంధ్ర బాలక సంబంధమగు నొక్క సభలో నధ్యక్షుడుగా నుండుడని పాఠశాల బాలకులు ప్రార్థింపగా నుండెదనని యొప్పుకొని తుదకు జేసినపని యిది! "నాకాంధ్ర భాష రాదు" నే నాంధ్రమున మాటలాడలేను. మీ యిష్టమగునెడల నాంగ్లేయ భాషలో మాటలాడుదును" యని యర్థమిచ్చు మాటల నాత డాంగ్లేయభాషలో బలికెను. తెల్లబోయి తెలివి తప్పి నిల్వుగ్రుడ్లు వైచికొనిన పసిబాలు రప్పుడేమి చేయగలరు? కొంతసేపు మాటలాడలేక నిరుత్సాహులై దీర్ఘనిశ్వాసములిచ్చి "మీ యిష్టమెటులో యటులే" యని యనిష్ఠతతో బలికిరి. అప్పుడాయధ్యక్షుడొక్క పావుగంటకాల మాంగ్లేయ భాషలో దేహసాధన విషయమును గూర్చి యుపన్యసించి తన యుపన్యాసమున కుపసంహారమును జెప్పి "విల్ ఎని జంటిల్మన్ కం ఫార్వర్డు టు స్పీక్" అని సభవారిని బ్రశ్నించెను. బాలకులు భగ్నోత్సాహులై యుండుట వలన బ్రత్యుత్తర మీయక యూరకుండిరి. అయ్యా నేను మాటలాడెదనని లేచితిని. "మనము చూడనేలేదయ్యా! మన జంఘాలశాస్త్రియే యయ్యా" యని వారిలో వారనుకొనుచు "ఎప్పుడు వచ్చినారు? ఎక్కడి నుండి వచ్చినారు? ఈ నడుమ రెండు పర్యాయములు కాబోలు సాక్షి రాలేదేమి? మీరు సభకు వచ్చిన తరువాత నైనను మాకు దెలియజేయ నక్కఱ లేదా? ఏమి న్యాయమయ్యా"యని యేవేవో యగ్రము నంతము లేని యనురాగసూచకములగున నసందర్భాలాపము లాడి నన్నుపన్యాసరంగము నొద్దకు దీసికొనిపోయిరి. నేనిట్లుపన్యసించితిని.


హరహరా! మహాదేవశంభూ! మహాదేవశంభూ! ఎంతమాట వినబడెను. ఎంతమాట వినబడెను. నాయనలారా! మీరు కూడ వింటిరి కాదా! నేనొక్కడనే వింటినా? ఏదో విని మఱియేదో యని భ్రమపడితినా? నాయనలారా! అట్లే యగునెడల నదృష్టవంతుడను గదా! నేనొకడను మాత్రమే యదృష్టవంతుడనా? ఆంధ్రులందఱదృష్టవంతులే కదా! ఆంధ్రదేశమంతయు నదృష్టవంతమైనదే కదా? ఆంధ్రదేశమున బుట్టి, యాంధ్రమాతాపితల కుద్భవించి, యాంధ్రసంప్రదాయములభ్యసించి, యాంధ్ర జాతీయ తత్త్వసంపత్తిచే నభివృద్ధి నొంది, యాంధ్ర భాషలో బండితులై యాంధ్ర గ్రంథముల రచించి యాంధ్రభాషాదేవి కమూల్యాలంకారములుగా నర్పించి, యాంధ్రదేశసేవ నాచరించి తమ యంగములు నసువులు నాత్మలు పవిత్రములుగ జేసికొని, ప్రాణములను బాసి పరమపదమును జేరిన ప్రాచీనాంధ్రులందఱు కూడ నదృష్టవంతులు కదా! అయ్యయ్యో ! అంతయదృష్టము పట్టునా? పట్టదు. వింటిని - నిజముగా వింటిని - నాది భ్రమము కాదు. తాత్కాలికోన్మాదము కాదు. మీరు గూడ నాతో పాటు వింటిరి. వినకయేమి చెవులు చిల్లులు పడినవా? మతి మందగించినదా! వినకపోవుట కూడానా? గుండెలు పగిలిపోవ వింటిమి - మనస్సు మండిపోవ వింటిమి - సిగ్గు చిమిడిపోవ వింటిమి



© SCERT not to be republished

– ప్రాణములు పైకెగిరిపోవ వింటిమి – నాయనలారా! "బ్రతికి యుండిన సుఖములు పడయవచ్చు" నని కవి చెప్పినాడే– ఇంకను జీవించి యున్నందుల కిదియా ఫలము – ఇదియా సుఖము.

ఆహాహా! ఏమని? ఏమని? మన యధ్యక్ష భగవానుని యాలాపకలాప మేది? వారు సాయించిన శ్రీసూక్తి యేది? వారి యాస్యగహ్వరము నుండి యవతరించిన యాగమసూత్రమేది? చెప్పనా ఆంధ్రుడు వచింపదగినదికాదే? చెప్పనా? చెప్పక తప్పునా? మన యగ్రాసనాధిపతి దేవుని కాంధ్ర భాష రాదట – ఆయన యాంధ్రమున మాటలాడనే లేరట. అయ్యయ్యో ! ఆంధ్రమున మాటలాడలేకపోవుటయేమి? మూగవారు కారే! నంగి నంగి మాటలవారు కారే – మెమ్మె పెప్పెయనువారు కారే – ఆంగ్లేయ భాషాపండితాగ్రగణ్యులే – బర్కుసిసిరో డెమాస్థెనీసు గ్లాడ్స్టను నిత్యాది మహా వక్తృవావదూకతావైభవమును గబళించి, నమలి, చప్పళించి, మ్రింగి, జీర్ణించుకొని రక్తమాంసముల గలుపుకొనినవారే. ఇది గాక బి.ఎల్. పరీక్షలో గడతేఱి, కాలాంబర కవచధారియై న్యాయమూర్తుల యెదుట గాకిని గ్రద్దను, గ్రద్దను గాకిని జేయజాలిన కర్కశతర్కవాగ్వాహినీ మోహినీకరణదక్షులే. అట్టి వాగ్ధోరణీధీరులగు వీరులాంధ్రమున మాటలాడలేకపోవుటయేమి? లేకపోవుట యనగా నాకేమో బోధపడలేదు. మ్యావుమని కూయలేని పిల్లి యెచ్చటనైన నుండునా? కిచకిచలాడలేని కోతిని మీరెచ్చటనైన జూచితిరా? ఈతరాని కప్ప యేదేశమందైనా నుండునా? పుట్టగానే క్యారుమనలేని బిడ్డ చచ్చిన దనుటకేమైన సందేహమా? ఆంధ్రదేశమున బుట్టిన పక్షులైన ననవరతశ్రవణమున నాంధ్రమున మాటలాడుచుండగా – అయ్యయ్యో! మనుజుడే అంత మనుజుడే – ఆంధ్రమాతాపితలకు బుట్టినవాడే – ఆంధ్రదేశీయ వాయునీరాహార పారణ మొనర్చివాడే – అధమాధమమాఱు సంవత్సరముల యీడు వఱకైన నాంధ్రమున మాటలాడినవాడే – అట్టి వాడాంగ్లేయ భాష నభ్యసించినంత




మాత్రమున నిప్పుడాంధ్రమున మాటలాడలేకుండునా? ఆశ్చర్యము అవిశ్వసనీయము. అసత్యము.

ఆంధ్రమున నాతనిని మాటలాడకుండ జేసినది అశక్తికాదు. అనిష్టత – అసహ్యత – అది శిలాక్షరమైన మాట. మాటలాడుట కిష్టమేల లేకపోవలయును? తెలుగు బాసయంత దిక్కుమాలిన బాస లేదనియే యీ యాంగ్లేయదేజస్సు నమ్మకము. తెలుగు మాటలాడినవాడు, విధము చెడినవాడు, విద్యరానివాడు, గౌరవము లేనివాడు, గతిలేని వాడు, తెలివిమాలిన వాడు, దిక్కుమాలినవాడు! ఆ! ఆ! ఆయన కట్టి యభిప్రాయమున్నది. అట్లే కాకున్న యెడల మాటలాడకపోవుటయేమి? అయ్యయ్యో! తెలుగులో మాటలాడుట సిగ్గు సిగ్గు ! అంత సిగ్గునకిది యేమంత యకార్యకరణము.

అయ్యయ్యో! మన భాషయే, మకరంద బిందుబృందరస స్యందన మందరమగు మాతృభాషయే. – మీరిట్టి భాషను బరిత్యజించి పై భాషను బఠించినారు – ఇన్ని మాన్యములమ్ముకొని, యింత సొమ్ము వ్యయపఱచి, యిందఱ నాశ్రయించి, యింత చిత్తక్లేశమంది సంపాదించిన మీ యాంగ్లేయ భాషాపాండిత్య మేమాత్రమో

కనిపెట్టెదము. ఆంగ్లేయ గ్రంథము లెన్నియో వ్రాయుచున్నారు. ఆంగ్లేయోపన్యాసము లెన్నియో యిచ్చుచున్నారు. మీకే మాత్రము భాషా సౌకర్యము కలిగినది? ఏ మాత్రపు భాషా సౌలభ్యము సిద్ధించినది ? గ్రంథజ్ఞానశూన్యుడగు జన్మ మాత్రాంగ్లేయునికి 'ఇంగ్లీషు మీడియం'లో నున్న సౌలభ్యములో సాబాలైన నర్థ శతాబ్ద మాంగ్లేయభాష నభ్యసించిన మీకలవడినదా? సంపూర్ణమైన భాషోచ్చారణ సౌష్ఠవమైన బట్టు పడినదా? ఏలపట్టుపడును? పై భాష యెన్నటికి బరభాషయే. మీరేవో యాంగ్లేయగ్రంథములను వ్రాయుచున్నారని యాంగ్లేయోపన్యాసములిచ్చుచున్నారని విశేషజ్ఞులమని యనుకొనుచున్నారు కాబోలు. అవియేమో యుపజ్ఞా సహితములగు వ్రాతలని వాగ్ధోరణులని యనుకొనుచున్నారు కాబోలు. అవి వట్టి తలవిఱుపులు చిలుకపలుకులు – కల్లకెంపులు – గాజుఊాలు. అవియన్నియు బ్రతిఫలములు పాఠాంతరములు. అవియన్నియు మక్కికి మక్కులు వెక్కిరింపులు. వానికి స్వతంత్రశక్తి లేదు. వెన్నెముక బలము లేదు. వానిలో 'ఒరిజినాలిటీ' అనునది లేదు. మీ లెక్కయేమి? మీతలలపై దాటిపోయిన ధీమంతులకే లెక్కలేదు. 'ప్యారడైజులాస్టు' వ్రాసి యాంగ్లేయవ్యాసపీఠాధిపత్యమున కర్హుడనిపించుకొనిన మిల్టన్ వ్రాసిన లాటిను పద్యములు లాటిన్ భాషయే స్వభాషగాగల దేశీయ కవులలో నధములగు వారు వ్రాసిన పద్యములకు దీసిపోవుచున్నవని వారి పరిశోధకులే వ్రాసినారు.

మన రాజధానిలో నున్న యొక్క కాలేజీలో 'వర్నాక్యులర్ సూపరింటెండెంటు'గా సంస్కృతభాషాపండితుఁడగు నొక్క యాంగ్లేయుడు వచ్చియుండెను. ఆతడు 'యంత్రబ్రహ్మవేదాంత' మున్నగు శ్లోకములను 'అయాంబికుమీటరు'లో జదువుట నేనెఱుఁగుదును. 'దివెల్నోను టెలుగు స్కాలర్' అని ప్రఖ్యాతి నొందిన బ్రౌను దొరగారాంధ్రమున నేమాత్రపుఁబండితులో మన మెఱుఁగక పోవచ్చును గాని యప్పటి వారెఱుఁగరా? ఆంగ్లేయుడు పదునెనిమిది సంవత్సరములు సంస్కృతభాషను సంతత దీక్షతో నభ్యసింపనీ – అభ్యసించినంత కాలమనవరత మననమున ఊాపిడిపెట్టనీ "హగుంసశ్యుచిష" న్మంత్రమును బొదుగు పొట్టి పలుకుబడి పరిపాటిని మాని సిసలైన యుచ్చారణతోఁజదువఁగలడేమో పరిశీలింపుడు. ఇఁక మీరు 24 సంవత్సరము లింగ్లీషు భాష నభ్యసింపుఁడు. "ఇన్మెమోరియం"లో నున్నదని చెప్పఁబడిన 'మ్యూజిక్' మీరు కనిపెట్టగలరేమో? అది వాని వలనఁగాదు. ఇది మీ వలనఁగాదు. వాని నోటి కది చిక్కదు – మీ చెవికిది యెక్కదు. పరభాషాపదములకర్థము తెలిసినంత మాత్రమున బరభాషాపాండిత్యము లభించినదని భ్రమపడకుడు. భాషలోని కళను బ్రాణమును తత్త్వము నాత్మను గనిపట్టవలయును. అది మీకసాధ్యము. తుదకిన్ని ఱూనాములు నమ్మి యమ్మమెడలోని పుస్తె పూసలమ్మి – వంట యింటి పాత్రల నమ్మి – దైన్య పడి – వారములు చేసికొని – ముష్టియెత్తి సంపాదించిన – యాంగ్లేయభాషలోని పాండిత్యపుఁబస యూరంగులోనికి దిగినది. ఈ విధముగా బ్రద్దలైనది.

స్వభాష యిదివఱకు మీ చేతఁజావనే చచ్చినది. మీగతి యెంత యుభయభ్రష్టమైనదో చూచుకొంటిరా? మీరు వెచ్చించిన ధనములో బడిన శ్రమములో వినియోగపఱచిన కాలములోఁ, బొందిన దైన్యములో, నేడ్చిన యేడ్పులలో, బదునాలవవంతైన నక్కఱలేకుండ మీరు దేశభాషాపండితులై యుందురు. స్వభాషను మీరు నేర్చుకొనుటకే మంత శ్రమమున్నది? అక్షరాభ్యాస దినమునుండియే మీరు స్వభాష నభ్యసించుచున్నారని యనుకొనవలదు. మీ తల్లి కడుపులో నున్నప్పుడే నేర్చుకొనుట మొదలుపెట్టినారు.

ఉపాధ్యాయుడైన నక్కఱలేకుండ గ్రంథములూరక చదువుకొనుచుఁబోయిన యెడల భాషాజ్ఞాన సంపాదన మీకెంతసేపు? నాకాంధ్ర భాష రాదని మన యధ్యక్షుఁడు కంఠోక్తిగాఁ బలికినాఁడు. మా భాష మాకు రాదను ననర్థవాక్య మాంధ్రుని నోట నుండి వెడలఁదగదు. ఏ జాతివారి నోటనుండియు నంతే – ఆంధ్రదేశమున పుట్టి యెంత కాలమైనదో,

© SCERT not to be republished

ఆంధ్రజాతి పుట్టి యెంత కాలమయినదో, ఇట్టి యనుచితవాక్యము నేఁడు బయలువెడలినది. అనుచితమనుమాట నిస్సందేహము. పోనిండు దీనికేమి? అనుచితతకు - నసందర్భతకు - నవకతవకకు - ననేక సంవత్సరముల నుండి యలవాటు పడియేయున్నాము. భాష మీకు రాదేమి? అబ్బా ! మీరే ప్రయత్నము చేసినారని రాదనుచున్నారు? భాష తనంతతాను మీకు వచ్చుననియే యనుకొనుచున్నారా?

యథార్థముగ స్వభాషాజ్ఞానమున కర్హుఁడుఁ గాని యద్భుతాజ్ఞానతత్త్వమే యగునెడ - నన్నయ భట్టు కాలము నుండి యిప్పటి వఱకున్న భాషా గ్రంథములన్నియుఁగట్టకట్టి బంగాళాఖాతములోఁబాఱవేయుదము. మనకు రాని భాషతో మనకేమి పని? అయ్యయ్యో ! రవంత కష్టమైన బడనక్కఱలేదా ? నోరు మెదలుపనైన నక్కఱలేదా? "క్రిమినల్ ప్రొసీజర్కోడ్" చేతఁ బట్టకుండనే మన యధ్యక్షశిరోమణికి శిక్షాశాస్త్ర సిద్ధియయినదా? "ట్రాన్స్ఫర్ ఆఫ్ ప్రాపర్టీ" ఆక్టు తలఁ గొట్టుకొని వల్లె వేసిన వారే.

'కన్నింగ్హామ్సు ఎవిడెన్సు' ఆక్టు వలన నీకడుపే నిండునుగాని కంకంటి వారి రామాయణము వలన నీ మనస్సు నిండునే? "జస్టిసుహాలోవే" గారి జడ్జిమెంటు నొప్పఁ జెప్పఁగలవు కాని జనక చక్రవర్తి ప్రపంచమునకు బోధించిన నీతి నెఱుఁగవే! "సివిల్ ప్రొసీజర్కోడు లేటెస్టు ఎడిషన్" కు గర్త యెవ్వఁడో యెఱుఁగుదువు కాని సీతారామాంజనేయకవి యెవఁడో యెఱుఁగవే?

అందఱు తెలుగుఁ మాటలాడవలసిన యిందఱిలో నీవొక్కఁడ వింగ్లీషులో మాటలాడితివి! కావు కావు మని యనవలసిన కాకులన్నిటిలో నొక్క కాకి కొక్కొరొకో యని యఱచిన యెడల మిగిలిన కాకులు దానిని ముక్కుతో బొడిచివేయక మానునా? మేము నీవంటి యనేక ప్రకృతుల కలవాటు పడినవారము కావున సరిపోయినది. కాని లేకున్ననేమి కాఁదగినది? ఆంగ్లేయభాష యేల చదువుకొంటివని నేనధిక్షేపింపను. ఇంతకన్న నధికజ్ఞానమును గూడ నీవాభాషలో సంపాదింపుము. నాకు మఱింత యిష్టము. కాని నీయాంగ్లేయ భాషాజ్ఞానమెందులకో నీవెఱుఁగుదువా? ఆంగ్లేయ భాషయే కాదు, ఇంక ననేక భాషలు కూడ నేర్చుకొనుము. నీవు సంపాదించిన పరభాషా జ్ఞానమంతయు నీభాష నభివృద్ధి పఱచుటకే. నీ భాషను భాగ్యవత్తరమును జేయుటకే - నీ భాషను బరభాషా గ్రంథ ప్రశస్తాభిప్రాయములతో వన్నెపెట్టుటకే - అంతకంటే వేఱుకాదే. ఆంధ్రభాషలో అ, ఆలకంటే నవతలి యక్కఱము లెఱుఁగనివాఁడవుకదా? ఆంధ్రుఁడవై యుండియు నాంధ్ర భాషలో 'ఆ' యని నోరు మెదలుపలేనివాడవు కదా? నీ యాంగ్లేయభాషాజ్ఞానమును దేశమున కెట్లు పచరింపఁదలఁచితివో చెప్పుము నాయనా! నిన్ను గ్రంథములు వ్రాయుమని కోరుచున్నానను కొంటివేమో? నీవు వ్రాయునదేమి? పార్టీలనెత్తిని పేఁడ - ఏ గ్రంథమును నీవు వ్రాయవలదు - ఏ గ్రంథము జదువవలదు. ఏడుపులో గూడ మన కస్వతంత్ర యేమి కర్మము? అందుకు సర్వస్వతంత్రులము సంపూర్ణాధికారులమే కదా? ముష్టి బ్రాహ్మణుడు నీయింటికి వచ్చి యాయావరపు బ్రాహ్మణుడి నయ్యాయని యఱవక "బాయ్! రూములో నున్న పాట్లో రైస్ యేమైన నున్నదేమో, కైన్డ్లీ గెటిట్ హియర్". థాంకుయూ ఇన్ ఆంటిసిపేషన్" అని నీతో సంభాషింపఁగ నీవాతనికి ముష్టి వేయుదువా? మూఁతిమీఁద నీడ్చి యొక్కటి వేయుదువా? అలాగే మనముష్టిలోని యీ యింగ్లీషు మాటలు కూడ నంత గౌరవప్రదములే యని నిశ్చయముగా నమ్ముఁడు. నమ్ముఁడు.

నాయనాలారా! మీ సభా కార్యక్రమము నంతయుఁ జెడఁగొట్టితిని. నన్ను మీరు క్షమింపవలయును. మఱి యెప్పుడైన నీసభ తిరుగఁజేసికొనుడు. (అప్పుడు మీరధ్యక్షులుగా రావలయును కేకలు) నాయనలారా! అటులే - మీరంత యాంధ్రభాషాభిమానముతోఁ బ్రవర్తించుచున్నప్పుడు నాచేతనైన సేవను నేను జేయనా? ఇఁక నాలుగు మాటలు మాత్రము చెప్పుదును. ఆంధ్రభాష బొత్తిగ రానివానితోడ నేకాని మీరాంగ్లేయమున నెన్నఁడు మాటాడవలదు. మీరు మీ


© SCERT not to be republished

మిత్రులకుత్తరము వ్రాయునప్పుడు 'డియర్ఫ్రెండ్'తో నారంభించి 'యువర్సుట్రూలీ'తోఁ బూర్తి చేయక 'బ్రహ్మశ్రీ' తోడనో ? 'మహారాజశ్రీ' తోడనోయారంభించి, 'చిత్తగింపవలయున'తో బూర్తి చేయవలయును. ఆంధ్రభాష వచ్చినవాని కాంగ్లేయభాషతో నుత్తరమెన్నఁడును వ్రాయకుఁడు. ఈ నియమములను మీరు చేసికోఁగలరా? (అభ్యంతరమేమి యనుకేకలు) నూతనముగా నచ్చుపడుచున్న యాంధ్రగ్రంథము లెల్లను విమర్శనబుద్ధితోఁజదువుఁడు. తొందరపడి యధిక్షేపింపకుఁడు. శనివారాది వారములందు రాత్రి తప్పకుండ రెండు గంటలు పురాణ పఠనమునఁ గాలక్షేపము చేయుఁడు. స్వభాషా పత్రికలను జూడకుండ నావలఁ బాఱవేయకుఁడు. ఆంగ్లేయ భాషాగ్రంథములు మీరు చదువుచున్నప్పుడు వానిలో 'మనభాష కక్కఱకు వచ్చు నంశము లేమియా" యని తదేక దృష్టితోఁ జూచుచు వానిని మెదటిలోఁబదిలపఱపుఁడు.

మీరీ నియమము లొనర్చుకొని పట్టుదలతోఁ బాటించి పుట్టుక చేతనే కాక, బుద్ధి చేత, స్వభావము చేత, యోగ్యత చేత, నాంధ్రులని యనిపించుకొనుడు.

**ఓమ్ శాంతిశ్శాంతి శ్శాంతిః**

## రచయిత పరిచయం



పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారు 11.2.1865 లో రాజమండ్రి – సీతానగరంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు రత్నమాంబ, వేంకటరమణయ్య. ఉన్నతవిద్య వరకూ రాజమండ్రిలోనే విద్యాభ్యాసం చేశారు. బళ్ళారి జిల్లాలోని ఆనెగొంది సంస్థానంలో దివానుగా కొంతకాలం చేసి, తరువాత పిఠాపురం సంస్థానంలో ఆస్థాన కవిగా స్థిరపడ్డారు.

సారంగధర, ప్రచండ చాణక్యము, విప్రనారాయణ, కంఠాభరణము, పూర్ణిమ, సరస్వతి, సరోజిని, సాక్షి మొ॥వి వీరి ప్రసిద్ధ రచనలు. వీరి శైలి అద్భుతమైన గ్రాంథిక భాషా ప్రవాహంతో సున్నితమైన వ్యంగ్యంతో, చురుక్కుమనే హాస్యంతో అలరారుతుంది.

సమకాలీన సమస్యలపై తీవ్రంగా స్పందించి, సంఘ సంస్కరణకు నడుం కట్టి, తన రచనల ద్వారా ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించిన పానుగంటివారు చిరస్మరణీయులు. వారి రచనలు ఈనాటి పరిస్థితులకు కూడా అద్దం పడుతున్నాయి. వీరు 1-1-1940 న పరమపదించారు.

### ప్రక్రియ : అధిక్షేప వ్యాసం

విషయ ప్రాధాన్యం ఉండి. ఒక క్రమంలో సమగ్రంగా వివరించిన దాన్ని వ్యాసం అంటారు.

అధిక్షేపమంటే ఎత్తిపొడుపు. ఇది వివిధ విషయాలపట్ల విమర్శ దృష్టితో వ్యంగ్య, హాస్యధోరణిలో వ్యాఖ్యానిస్తూ, పరిష్కారమార్గాన్ని సూచిస్తూ సాగే సాహిత్య ప్రక్రియ.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I. అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది వాటి గురించి సొంతమాటల్లో చెప్పండి.**

1. మాతృభాషలోనే మాట్లాడితే కలిగే ప్రయోజనాలేమిటి?
2. ఈ కింది అంశం గురించి విభేదిస్తూ లేదా సమర్థిస్తూ మాట్లాడండి?
   'మాతృ భాషలో విద్య'

**ఆ) పాఠం చదవండి. కింది అంశాలను గుర్తించండి.**

1. ఆంగ్లభాష గురించి ప్రస్తావించిన అంశాలు.
2. పాఠంలోని ఆంగ్లపదాలు.
3. జంఘాలశాస్త్రి సందేశ వాక్యాలు.

**ఇ) పాఠం చదివి కింద ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. జంఘాలశాస్త్రి ఎవరు?
2. సభాధ్యక్షులు మాట్లాడిన విషయాలు ఏవి?
3. జంఘాలశాస్త్రి ఆవేదనతో పలికిన మాటలేవి?
4. జంఘాలశాస్త్రిని సభలోనివారు ఎలా ఆహ్వానించారు?
5. జంఘాలశాస్త్రి ఎవరిని అదృష్టవంతులంటున్నాడు?

**ఈ) కింది అంశానికి భావం ఏమిటి? దీన్ని ఏ సందర్భంలో మాట్లాడాడు?**

1. "కావు కావుమని యనవలసిన కాకులన్నిటిలో నొక కాకి కొక్కొరోకో యని యఱచిన యెడల మిగిలిన కాకులు దానిని ముక్కుతో బొడిచి వేయక మానునా?"
2. మకరంద బిందు బృందరస స్యందన మందరమగు మాతృభాషయే.

### II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సొంతమాటల్లో జవాబులు రాయండి**

1. కావ్యభాష వ్యావహారిక భాషలంటే ఏమిటి ? వీటి మధ్య భేదాలు ఏమిటి?
2. జంఘాలశాస్త్రి మంచి వక్త అని ఎలా చెప్పగలవు?
3. సభాధ్యక్షుడు తెలుగు మాట్లాడక పోవడానికి కారణం ఏమైఉంటుంది?

**ఆ) కింది ప్రశ్నలకు పదిహేను వాక్యాలలో సొంతమాటల్లో రాయండి**

1. జంఘాల శాస్త్రి గురించి సొంత మాటల్లో రాయండి.
2. "ఆంగ్లభాషయే కాదు. ఇంకననేక భాషలు కూడా నేర్చుకొనుము. నీవు సంపాదించిన పరభాషా జ్ఞానమంతయు నీ భాషను అభివృద్ధిపరచడానికే" ఈ వాక్యాల ద్వారా మీరేం గ్రహించారు? దీనిపై మీ అభిప్రాయం రాయండి.
3. తెలుగు భాష వచ్చి కూడా కావాలని ఆంగ్లంలో మాట్లాడేవారు ఎదురై, మీతో ఆంగ్లంలోనే మాట్లాడితే, మీకెలా ఉంటుంది? మీరేం చేస్తారు?
4. "వినక ఏమి చెవులు చిల్లులు పడినవా?" అని జంఘాలశాస్త్రి ఎందుకన్నాడు ? ఈ మాటలను ఇంకా ఏయే సందార్భాలలో ఉపయోగిస్తారు?

© SCERT not to be republished

ఇ) సృజనాత్మకంగా రాయండి.

జంఘాలశాస్త్రి పాత్రను ఏకపాత్రాభినయం చేయండి?

ఈ) ప్రశంసాత్మకంగా రాయండి.

మీ స్నేహితులలో కేవలం తెలుగులోనే ఒక రోజంతా మాట్లాడగలిగేవారెవరో గుర్తించి, వారిని అభినందిస్తూ కేవలం తెలుగుపదాలతో ఒక అభినందన పత్రం రాయండి.

లేదా

పాఠంలోని ఏవైనా రెండు పేరాలను వ్యవహార భాషలోకి మార్చి రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

అ) కింద గీతగీసిన పదాలకు అర్థాలు రాసి, ఆ పదాలను ఉపయోగిస్తూ సొంతవాక్యాలు రాయండి.

1. ఆంగ్లోపన్యాసం అర్థం కాని విద్యార్థులు భగ్నోత్సాహులై ఉన్నారు.
2. శిశువుల మాటలు చిలుక పలుకుల్లా ఉంటాయి.
3. తొందరపడి ఎవరినీ అధిక్షేపించ గూడదు.
4. న్యాయవాది తన వృత్తిని నిరాఘాటంగా నిర్వహిస్తున్నాడు.

ఆ) కింది పట్టికలో ప్రకృతి వికృతుల పదాలున్నాయి. వాటిని గుర్తించి రాయండి.

| | | | |
|---|---|---|---|
| భాష | రాతిరి | పక్షి | అచ్చెరువు |
| పక్కి | ఆశ్చర్యము | విద్దె | గృధ్రము |
| విద్య | గద్ద | రాత్రి | బాస |

### వ్యాకరణం

(అ) రెండుగాని, అంతకంటె ఎక్కువగాని వాక్యాలలోని సమాపక క్రియలను అసమాపక క్రియలుగా మార్చి, ఆ వాక్యాలను ఒకే వాక్యంగా రాస్తే దాన్ని 'సంశ్లిష్ట వాక్యం' అంటారని మీరు తెలుసుకొన్నారు కదా!

కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.

1. ఆంగ్లేయ గ్రంథములెన్నియో వ్రాయుచున్నారు.
   ఆంగ్లేయ ఉపన్యాసములెన్నియో ఇచ్చుచున్నారు.
2. నన్ను మీరు క్షమింపవలయును.
   మఱి యెప్పుడైన ఈ సభ తిరుగ జేసికొనుడు.

(ఆ) సమాన ప్రాధాన్యంగల సామాన్యవాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడితే దాన్ని సంయుక్తవాక్యమంటారని తెలుసుకున్నారు కదా!

(ఆ) కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.

1. ఆయన ఆంధ్రుడు.
   ఆయన కృష్ణాతీరమున పుట్టినవాడు.
2. మోహన కూచిపూడి నృత్యం నేర్చుకొంది.
   భావన భరతనాట్యం నేర్చుకొంది.

© SCERT not to be republished

భూతకాలిక అసమాపక క్రియను క్త్వార్థం అంటారు. సంస్కృతంలో 'చేత్' అనే ప్రత్యయానికి 'అయితే' అని అర్థం. ఇలా తెలుగులో అదే ప్రత్యయం ఏ పదానికైనా చేరితే దానిని 'చేదర్థకం' అంటారు. వర్తమాన అసమాపకక్రియను 'శత్రర్థకం' అంటారు. ఇవన్నీ మీరు కిందటి తరగతిలోనే నేర్చుకున్నారు కదా!

**ఇ) కింది వాక్యాలు చదవండి. వీటిలో క్త్వార్థకం, చేదర్థకం, శత్రర్థకంలకు చెందిన అసమాపక క్రియలున్న వాక్యాలను గుర్తించండి.**

1. వర్షాకాలంలో వానలు పడితే పంటలు పండుతాయి.
2. కవిత గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలు తెచ్చింది.
3. సుగుణ వంట చేస్తూ పాటలు వింటోంది.
4 సరిగ్గా మందులు వాడితే జబ్బు తగ్గుతుంది.
5. రంగయ్యకు రెక్కాడితే కాని డొక్కాడదు.
6. మాధవి ఉద్యోగం చేస్తూ చదువుకొంటున్నది.

**ఈ) కింది పేరాలో అవసరమైన చోట తగిన విరామ చిహ్నాలుంచండి.**

మనము చూడనేలేదయ్యా మన జంఘాలశాస్త్రియే యయ్యా యని వారిలో వారనుకొనుచు ఎప్పుడు వచ్చినారు ఎక్కడి నుండి వచ్చినారు మీరు సభకు వచ్చిన తరువాతనైనను మాకు తెలియజేయనక్కఱ లేదా ఏమి న్యాయమయ్యా యని యేవేవో అసందర్భములాడి నన్నుపన్యాసరంగము నొద్దకు తీసికొనిపోయిరి.

**ఉ) ప్రత్యక్ష, పరోక్ష కథనాలు**

**ప్రత్యక్ష కథనం :-**

**కింది వాక్యాలు చదవండి.**

1. "నన్ను ఉపన్యాసరంగము నొద్దకు దీసికొనిపోయిరి."
2. "నేనిట్లు ఉపన్యసించితిని."
3. "నాయనలారా! నేను మీ సభా కార్యక్రమమునంతయు జెడగొట్టితిని."
4. "నన్ను మీరు క్షమింపవలయును."

పై వాక్యాలన్ని జంఘాల శాస్త్రి నేరుగా చెబుతున్నట్లు ఉన్నాయి కదా!
నేను, మేము, ...... ఇలా ఉండే వాక్యాలు అనగా ఉత్తమ పురుషలోని వాక్యాలు సాధారణంగా ప్రత్యక్షంగా చెబుతున్నట్లుగా ఉంటాయి.

**అట్లే కింది వాక్యాలను చదవండి.**

1. "నేనొక్కడినే అదృష్టవంతుడినా?" అన్నాడు జంఘాల శాస్త్రి.
2. "నేను రాను" అని నరేశ్ రఘుతో అన్నాడు.

లేదా

"నేను రా"నని నరేశ్ రఘుతో అన్నాడు.

పై వాక్యాలలో గీతగీసిన మాటలను ఎవరు అన్నారు?

మొదటి దాంట్లో జంఘాలశాస్త్రి అన్న మాటలను, రెండవదాంట్లో నరేశ్ అన్నమాటలను "ఉద్ధరణ చిహ్నాలు" (ఇన్వర్టడ్ కామాలు) ఉంచి చెప్పారు కదా!

ఇలా నేరుగా చెప్పదల్చుకున్న అంశాలను ఉద్ధరణ చిహ్నాలు ఉంచి చెప్పినపుడు వారే ప్రత్యక్షంగా చెప్పినట్లుగా ఉంటుంది.

ఈ విధంగా చెప్పడాన్ని ప్రత్యక్ష కథనం అంటారు.

**పాఠం చదవండి. ప్రత్యక్ష కథనంలో ఉన్న వాక్యాలను గుర్తించండి. వాటి కింద గీత గీయండి.**

**పరోక్ష కథనం :-**

**కింది వాక్యాలు చదవండి.**

1. నరేశ్ తాను రానని రఘుతో అన్నాడు.
2. ప్రధానోపాధ్యాయుడు చెప్పినట్లుగా చేస్తామని పిల్లలు అన్నారు.
3. తనను క్షమించమని రాజు తన మిత్రుడితో అన్నాను.

పై వాక్యాలను చదివారు కదా! ఇవి నేరుగా చెబుతున్నట్లుగా ఉన్నాయా?

ఉత్తమ పురుషలో కాకుండా, ఇంకొకరు చెబుతున్నట్లుగా ఉన్నాయా?

ఇలాంటి వాక్యాలను పరోక్ష కథనం అంటారు. వీటిలో ఉద్ధరణ చిహ్నాలు ఉపయోగించాల్సిన అవసరం లేదు.

**పాఠం చదవండి. పరోక్ష కథనంలోని వాక్యాలను గుర్తించండి. వాటి కింద గీత గీయండి.**

**ప్రత్యక్ష కథనంలో ఉన్న వాటిని పరోక్ష కథనంలోకి మార్చడం.**

**కింది వాక్యాలను చదవండి. ఏం మార్పు జరిగిందో చెప్పండి.**

1. "నేనొక్కడినే అదృష్టవంతుడినా?" అన్నాడు జంఘాల శాస్త్రి.
2. తానొక్కడే అదృష్టవంతుడా అని జంఘాల శాస్త్రి అన్నాడు.

మొదటి వాక్యంలో జంఘాలశాస్త్రి మాట్లాడిన మాటలను ఉద్ధరణ చిహ్నాలు ఉంచి రాశారు. రెండో వాక్యంలో జంఘాల శాస్త్రి అన్నమాటలను ఇంకొకరు చెప్పినట్లుగా రాశారు. ఇందుకోసం ఉద్ధరణ చిహ్నాలు తీసివేసి "అని" చేర్చి వాక్యాన్ని రాసారు. కాబట్టి మొదటి వాక్యం ప్రత్యక్ష కథనంలో ఉంటే, రెండవ వాక్యం పరోక్ష కథనంలోకి మారింది.

ప్రత్యక్ష కథనంలోని వాక్యాలు పరోక్ష కథనంలోకి మారేటపుడు కింది మార్పులు చోటు చేసుకుంటాయి.

మాటలు / వాక్యంలోని భావాన్ని స్వీకరిస్తారు.

ఉద్ధరణ చిహ్నాలు తొలగించి 'అని' చేరుస్తారు.

ఉత్తమ పురుషపదాలు అనగా నేను, మేము వంటివి,

ప్రథమ పురుషలోకి అనగా తను, తమ, తాను, తాములుగా మారుతాయి.

1. పాఠంలోని ప్రత్యక్ష కథనంలోని వాక్యాలను గుర్తించండి. వాటిని పరోక్ష కథనంలోకి మార్చి రాయండి.
2. మీరే మరికొన్ని ప్రత్యక్ష కథనంలోని వాక్యాలు రాయండి. వాటిని పరోక్ష కథనంలోకి మార్చండి.

**ప్రాజెక్టు పని**

తెలుగుభాష గొప్పదనాన్ని వివరించే వ్యాసాలను, పద్యాలను సేకరించండి.వాటి గురించి తరగతిలో చర్చించండి.

**నిజమైన భావ ప్రేరణ, ప్రగతి మాతృభాష వల్లనే లభిస్తాయి.**

**- గాంధీజీ**

© SCERT not to be republished